గావంగల విశ్వాసప్రకటనమునకుఁ గాను నీ కీ గ్రామ మిచ్చుచున్నాను. స్వీకరించి పుత్ర పౌత్ర పారంపర్యముగ సుఖాన అనుభవింపుము.”

మును, రక్షోజన తాపరీవృతమహీపుత్రిన్ విలోకించి యా
హనుమంతుం డొసరించినాడు విభుకార్యంబున్ వెసన్; శత్రురా
డ్జనమధ్యంబుననున్న నీప్రభువు నశ్వశ్రేష్ఠముం దెచ్చి తో
హనుమప్పా! మరువంగఁజాలరుగదయ్యా! తెన్గుబిడ్డల్ నినున్.
పాణిభ్రంశ వినిర్గళద్రుధిర సంపాతమ్మునన్ దావక
ప్రాణత్యాగ సమున్ముఖామల మనోభావమ్మునన్ నేటికిన్
రాణింపంగల స్వామికార్యపరతంత్రత్వంబు, సద్భక్తి పా
రీణత్వం బెరిఁగించు నాంధ్రజనయిత్రీ పుత్ర కీర్త్యున్నతుల్.

ఇట్లు చెప్పి సోమనాద్రి దానశాసనము వ్రాయించి బొచ్చంగన్నపల్లి హనుమప్పనాయనికిచ్చెను. ఆ రాజభక్తుని సంతతి వారు నేటికిని గండ్వాల సంస్థానమునందు ఆ బొచ్చంగన్నపల్లి యగ్రహారమును సుఖాన ననుభవించుచున్నారు. ప్రపంచమునందలి వివిధదేశచరిత్రలలో ఏదేశ చరిత్రమందును ఈ ఆంధ్రరాజభక్తుని చరిత్రవంటి చరిత్ర కానరాదు.

## కోల్పడిన ప్రేమకు

కనులు విచ్చి నీదుసమాధి కాంచలేను
అట గులాబి తీయని దెంతయైన నేమి!
నా అడుగులంట పర్వు శూన్యతను కడుగు
పెనుతరంగాల మ్రోతల వినుటె చాలు!
ఊరట వహింతునా? మహాదూరమున వ
సింతువేమొ జీవాత్మవై, ఎదో అగాధ
నీరవత ఆవరించగా తారకలకు
చుట్టు నెలకొను నిశ్శబ్ద మట్టిది నిను.
శీతలివి నీ వైతివి! ద్యోతలాన
నివసముందువు నీయంత నీవె, అచటి
అమితమతిమంతమైన నీహాయిలోన
పరివృత విన్నూత్నదున్నత్తభావమెల్ల.
కాని యైన నొక్కొకవేళ కాంచెదీవు
కడచు నొక్కనిశ్వాసమ్ము, గాఢబాధ;

చకితనాడు తెరువంబడి స్వర్గమందు
ద్వారమొకడు వెన్వెంట మూతపడినట్లు.
సంచలింతు నీవింత ప్రశాంతములగు
ప్రార్థనాగీత లచ్చటి వాగిపోవు,
సగము స్మరియింతు వీవొక్క క్షణము నన్ను:
మరల నీశాంతిలోనికి మరిగిపోదు.

ఐన నయ్యయో! ఇకపై ననారతమ్ము
నీదు చూపు, నవ్వు, హొయలు, నీగళమ్ము,
వివిధ తావక భూలోకవిభ్రమములు
పోవు నెన్నెన్నో చినిచిన్ని ముచ్చట లవి.
కాన తావకీనసమాధి కాంచలేను
అట గులాబి తీయని దెంతయైన కాని,
నాఅడుగులంట పర్వు శూన్యతను కడుగు
పెనుతరంగాల మ్రోతలే వినగవలతు.

—స్టీఫెన్ ఫిల్లిప్స గీతముల కనువాదము.

శ్రీరంగం శ్రీనివాసరావు